మాజీ సర్పంచుల నిరవధిక దీక్షలు ప్రారంభం

కలెక్టరేట్, డిసెంబర్ 9 : పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో మాజీ సర్పంచులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కలెక్టరేట్ ఎదుట సోమవారం మొదలయ్యాయి. మాజీ సర్పంచుల ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ నిరసన శిబిరంలో జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన మా జీ సర్పంచులు పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు ఆ సం ఘం ప్రతినిధులు దీక్షలో పాల్గొన్న మాజీ సర్పంచులకు తాజా మాజీ సర్పంచుల జిల్లా జేఏసీ అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం పూలదండలు వేసి, ప్రారంభించారు. అనంతరం పలువురు తాజా మాజీ సర్పంచులు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు తమకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా గ్రామాల్లో సౌకర్యాలు కల్పించేందుకు తమ ఆస్తులు తాకట్టు పెట్టి అభివృద్ధి పనులు చేపడితే, తమను ఏడాదిగా ఏడిపించడం సబబుకాదన్నారు. తాజా,మాజీ సర్పంచుల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే అధిక సంఖ్యలో ఉండగా, అభివృద్ధితోనే తమకు గ్రామాల్లో గుర్తింపు లభిస్తుందనే భావనతో అప్పులు తెచ్చి గ్రామాల్లో వెలుగులు నింపామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే సర్పంచుల సమస్యలు తీర్చడంతో పాటు పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన నాయకులు, ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు నెరవేర్చకపోవడంతో తమ కుటుంబాల్లో చీకట్లు రాజ్యమేలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించేవరకు నిరవధిక నిరాహార దీక్షను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. మొదటి రోజు నిరసన దీక్షలో తాజా మాజీ సర్పంచులు రామిడి సురేందర్, మట్లపల్లి గంగాధర్, ఎండీ నజీర్, వడ్లూరి ఆదిమల్లు, జగన్‌మోహన్ గౌడ్, మేడి అంజయ్య, లచ్చయ్య, సురేందర్‌రెడ్డి, దుండ్ర రాజయ్య, ఆర్ లక్ష్మి, సమ్మయ్య, రెండ్ల శ్రీనివాస్, జక్కం నర్సయ్య పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పనులు

- తాగునీటి సరఫరా మరింత మెరుగు
- మేయర్ సునీల్‌రావు

పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 9 : కరీంనగర్ వ్యాప్తంగా నగరపాలక సంస్థ నుంచి పెద్ద ఎత్తున్న అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రానున్న నాలుగు నెలల్లోనూ విలీన గ్రామాలతో పాటుగా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలకు కూడా ప్రతి రోజూ తాగునీటి సరఫరా అందిస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని 21వ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులను నగర కమిషనర్ చాహత్ భజ్‌పాత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అమృత్ పథకం కింద నగరంలోని అన్ని ప్రాంతాల్లో ప్రతి రోజూ తాగునీటి సరఫరా అందించేందుకు పైపులైన్ పనులు చేపడుతున్నామన్నారు. ఈ పనుల్లో సుమారుగా 150 కిలోమీటర్ల మేరకు కొత్త పైపు లైన్ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. వీటితో పాటుగా రిజర్వాయర్ల నిర్మాణాలు కూడా చేపడుతున్నామని తెలిపారు. ఈ పనులు పూర్తి అయితే నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ తాగునీటి సరఫరా చేయగలుగుతామన్నారు. అలాగే తాగునీటి పైపులైన్ పనులతో పాటుగా నగరంలో అన్ని చౌరస్తాల్లోనూ వీధిదీపాలను ఏర్పాటు చేయడానికి త్వరలోనే 760 హైమాస్ లైట్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. దీనికి సంబంధించి అన్ని చర్యలు తీసుకున్నామని, సంబంధించి కాంట్రాక్టర్‌కు కూడా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. తమ హాయాంలో నగరంలో ఎప్పుడు జరగని అభివృద్ధి చేసి చూపించామన్నారు. కేసీఆర్ సహకారంలో నిధులు రావడం వల్లే నగరాన్ని అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి సాగర్, నాయకులు, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

హైనా దాడిలో లేగ దూడ మృతి

చిగురుమామిడి, నవంబర్ 9 : మండలంలోని గాగిరెడ్డి పల్లె గ్రామంలో హైనా దాడిలో లేగ దూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన చిన్నవేని మల్లయ్య తన వ్యవసాయ పశువుల పాక వద్ద లేగ దూడను యధావిధిగా కట్టివేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు రాగా పశువుల పాకలో లేక దూడ మృతి చెంది కనిపించింది. దాన్ని పరిశీలించగా లేగ దూడను హైనా చంపి వేసిందని గుర్తించాడు. వెంటనే సమాచారాన్ని ఇందుర్తి పశు వైద్యాధికారి సాంబారావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సమీనా పర్వీన్‌కు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి పంచనామ నిర్వహించారు. ప్రభుత్వం కు నివేదిక అందజేసి బాధితుడికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందేలా చేస్తామని వారు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.

NT-338976-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

మాజీ సర్పంచ్‌ల అరెస్ట్‌లను ఖండిస్తున్నాం

చిగురుమామిడి, నవంబర్ 9 : పెండింగ్‌లో ఉన్న బిల్లులను సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచులు చలో అసెంబ్లీ కార్యక్రమానికి బయలుదేరిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్ అన్నారు. కొండాపూర్ గ్రా మంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు సోమవారం చలో అసెంబ్లీకి ముట్టడిని పిలుపిస్తే అక్కడికి వెళ్లకుండా మండల మాజీ సర్పంచ్‌లను స్థానిక పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. బీజేపీ మండల నాయకులు సంపత్, బుర్ర సదానందం, ప్రవీణ్, ఒదయ్య పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

శంకరపట్నం, డిసెంబర్ 9: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో క్రిష్ణ భాస్కర్, ఎంపీవో ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలపై ప్రభుత్వం ఇకనైనా దృష్టి సారించాలన్నారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గన్నేరువరం : ముందస్తుగా అరెస్టు అయిన మాజీ సర్పంచులు

తిమ్మాపూర్ : ఎల్‌ఎండీ ఠాణాలో రావుల రమేశ్, సర్పంచులు

హుజూరాబాద్ టౌన్ : పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

బిల్లులు చెల్లించే దాకా అక్రమ అరెస్టులకు భయపడేది లేదు

అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మాజీ సర్పంచుల అరెస్ట్

చిగురుమామిడి : అరెస్ట్ అయిన మాజీ సర్పంచులు

చిగురుమామిడి, నవంబర్ 9 : పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్‌లు చలో హైదరాబాద్ తలపెట్టిన నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం ఉదయం నుంచి మండల వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లను పోలీసులు ఇండ్ల వద్దనే అరెస్టు చేసి, పోలీస్ స్టేషనల్లకు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జక్కుల రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినప్పటికీ తమకు చెల్లించాల్సిన బిల్లులు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. తమ బిల్లులు అందించాలని డిమాండ్ చేస్తే అరెస్టు చేస్తారా అని వారు ప్రశ్నించారు. బిల్లులు మంజూరు చేసే వరకు తమ పోరాటం ఆపేది లేదని మాజీ సర్పంచులు స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం అప్పులు చేసి, ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ సర్పంచుల జీవితాలతో రాజకీయ చెలగాట మాడుతోందన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంకు ఎన్నిసార్లు తమ బిల్లులు చెల్లించాలని విన్నవించినా ఫలితం లేదన్నారు. అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని, గ్రామాల్లో అడ్డుకుంటామని వారు స్పష్టం చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు సన్నిళ్ల వెంకటేశం, నాగేల్లి వకుళ లక్ష్మీరెడ్డి, గోలి బాపురెడ్డి, శ్రీనివాస్, బెజ్జంకి లక్ష్మణ్ ఉన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించండి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 9 : రంగాపూర్ మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించాలంటే అరెస్టులు చేయడమేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు ప్రతాపరెడ్డి, మనోహర్, లక్ష్మారెడ్డి, నిరోషా కిరణ్, తిరుపతి ఉన్నారు.

వీణవంక, డిసెంబర్ 9 : పెండింగ్ బిల్లులు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి యత్నించిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మాజీ సర్పంచ్‌లు బండారి ముత్తయ్య, మోరె సారయ్య, జున్నూతుల సునీతామల్లారెడ్డి, మర్రి వరలక్ష్మీస్వామి, పోతుల నర్సయ్యను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఎస్ఐ తోట తిరుపతి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గన్నేరువరం,డిసెంబర్ 9: మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచ్ లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ వారిలో సర్పంచ్ల ఫోరం మండలాధ్యక్షుడు తీగల మోహన్ రెడ్డి, సర్పంచులు గంప మల్లేశ్వరి వెంకన్న, పుల్లెల లక్ష్మీ లక్ష్మణ్, శారదాశ్రీనివాస్, నగేశ్ ఉన్నారు.

తిమ్మాపూర్,డిసెంబర్9: మండలంలోని మాజీ సర్పంచులను ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచి రావుల రమేశ్, పలు గ్రామాల సర్పంచులు మేడి అంజయ్య, వడ్లూరి శంకర్, మామిడి సతీశ్‌ను స్టేషన్‌కు తరలించారు.

అరెస్టులను ఖండించిన సర్పంచుల ఫోరం

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 9 : మాజీ సర్పంచుల అరెస్టును సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి ఖండించారు. సోమవారం అరెస్టయిన మాజీ సర్పంచులను పోలీస్ స్టేషన్‌లో కలిసి పరామర్శించారు. మాజీ సర్పంచులను దొంగల్లా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి, రోజంతా స్టేషన్లో కూర్చోబెట్టడం బాధాకరమన్నారు.

బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఆదర్శ విద్యార్థి

రామడుగు, డిసెంబర్ 9 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ ప్రతిభ పరీక్షలో స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కే రష్మిత పాల్గొని చక్కటి ప్రతిభ చూపి మొదటిస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రష్మితకు పాఠశాల ప్రిన్స్‌పాల్ ఆడెపు మనోజ్‌కుమార్, వైస్ ప్రిన్స్‌పాల్ కోల రమేశ్, బయోసైన్స్ ఉపాధ్యాయులు సుజాత, రత్నాకర్ అభినందనలు తెలిపారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

జమ్మికుంట, డిసెంబర్9 : హుజూరాబాద్ పట్టణానికి చెందిన గంగిశెట్టి మధు రమ్మ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు జగదీశ్వర్ (రిటైర్డ్ ఉపాధ్యాయుడు) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కస్తూర్బాలో చదువుతున్న పదవ, ఇంటర్ పాఠశాల విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రస్టు నిర్వాహకుడు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, ప్లేట్లు, టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నామని, అత్యుత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్నామని తెలిపారు. ట్రస్టు నిర్వాహకుడు సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ సుప్రియ అన్నారు. ఉపాధ్యాయులు సుమలత, లావణ్య, రేణుక, శ్రీలత, దేవకుమారి, వరలక్ష్మి, అనూశ, నీలోఫర్, విద్యార్థులున్నారు.

మండలస్థాయి ప్రతిభ పోటీలు

మానకొండూర్, డిసెంబర్ 9: జీవశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో సోమవారం మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల నుంచి ఇద్దరు విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొన్నారు. ఇందులో వివిధ అంశాలలో ప్రతిభ చూపి విద్యార్థులను ఈ నెల 18న జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికచేశారు. జిల్లాస్థాయి ప్రతిభా పోటీలకు ఎంపికైన విద్యార్థులు ప్రథమ స్థానంలో త్రివేణి (పచ్చునూర్), అశ్విత (కేజీబీవీ, మానకొండూర్), రాజు (బాలుర ఉన్నత పాఠశాల మానకొండూర్), ద్వితీయ స్థానంలో సనుఫా ఫాతిమా, ఆదిలక్ష్మీ (బాలికల ఉన్నత పాఠశాల మానకొండూర్), తనూజ వర్ధన్ ఎంపికయ్యారు.

సంచార జాతులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 9 : రాష్ట్రంలో ఖాళీ ఉన్న ఎమ్మెల్సీ స్థానాలలో ఒక స్థానం సంచార జాతులకు కేటాయించాలని తెలంగాణ సంచారం జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిపిరిశెట్టి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి సింగజోగి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షుడు రామస్వామి అధ్యక్షతన నిర్వహించి జిల్లా స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయంగా సంచార జాతులు వెనుబడి ఉన్నట్లు తెలిపారు. సంచార జాతుల సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్సీగా బరిలో ఉన్న గంగధర్‌కు అధికార పార్టీ మద్దతు ఇవ్వాలని కోరారు.

ప్రత్యేక శ్రద్ధచూపాలి

మానకొండూర్, డిసెంబర్ 9: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్ కే రాజేశ్వర్‌రావు సూచించారు. రాష్ట్ర ఇంటర్ విద్యడైరెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీఏసీ బస్సులో టికెట్‌పై రాయితీ

తెలంగాణచౌక్, డిసెంబర్ 9 : ఆర్టీసీ ఏసీ స్లీపర్, ఏసీస్లీపర్ కంసీటర్, రాజధాని బస్సు సర్వీస్‌ల్లో డిసెంబర్ 1 నుంచి 31 వరకు టికెట్ బేసిక్ చార్జీలో పది శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కరీంనగర్ రీజియన్ మేనేజర్ బీ రాజు సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. రాష్ట్ర అంతర్‌రాష్ట్ర బస్‌సర్వీసుల్లో ఈ సదుపాయం ఉంటుంద న్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాగుపై రైతులకు అవగాహన

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 9 : మండలంలోని మొగిలిపాలెం గ్రామంలో అఖిల భారత మొక్కజొన్న పరిశోధన కేంద్రం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం సంయుక్తంగా జీరో టిల్లేజ్ మొక్కజొన్న పంట సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త జీ మంజులత మాట్లాడారు. అనంతరం రైతులకు గడ్డి మందులు పంపిణీ చేశారు. వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ శాస్త్రవేత్తలు మధుకర్ రావు, శ్రావణి, మండల వ్యవసాయ అధికారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

చొప్పదండి, డిసెంబర్ 9 : గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ సీఈవో దుర్గా ప్రసాద్ ఆదేశాల మేరకు.. నియోజకవర్గంలోని గామ ఫౌండేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న కుటుంబాలకు ఆర్థిక భరోసాలో భాగంగా ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ మేరకు సోమవారం గ్రామ ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జోగు నర్సయ్య, గ్రామ ఫౌండేషన్ చొప్పదండి ప్రధాన కార్యదర్శి సురేశ్ ఆధ్వర్యంలో ఆహారభద్రత, ఆర్థిక భద్రతలో భాగంగా 80 కుటుంబాలకు నిత్యావసర సరుకులు 20 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 10వేలు చొప్పున ఆర్థిక భరోసాలో భాగంగా అందించినట్లు ఫౌడేషన్ సభ్యులు తెలిపారు. చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తురి మహేశ్, కాంగ్రెస్ చొప్పదండి మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, చొప్పదండి మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణ హరి పాల్గొన్నారు

ప్లంబర్ సంఘం మండల కార్యవర్గం

తిమ్మాపూర్,డిసెంబర్9: ప్లంబర్ కార్మికుల సంఘం మండల అధ్యక్షునిగా మహాత్మానగర్ గ్రామానికి చెందిన కాశిపాక రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నం మల్లేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు కన్నం సంపత్ ఆధ్వర్యంలో ఎల్ఎండీలో జరిగిన కార్యవర్గ సమావేశంలో సభ్యులు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా కన్నం చందు, మహంకాళి మనోహర్, ప్రధాన కార్యదర్శిగా బామండ్ల రాజు, కోశాధికారిగా ఓగుల తిరుపతి, బామండ్ల శివకుమార్, ముఖ్య సలహాదారుడిగా కన్నం మల్లేశ్, లక్ష్మణ్, సంపత్, కార్యవర్గ సభ్యులుగా కొండ్ర దిలీప్, కన్నం మహేశ్, బామండ్ల నర్సింగరావు, మంద మల్లేశ్, బాబు, బామండ్ల సుధాకర్‌ను ఎన్నుకున్నారు.

ఆర్టీసీ ఆర్ఎంతో ఈడీ సమీక్ష

తెలంగాణచౌక్, డిసెంబర్ 9: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలోని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఖుస్రోషా ఖాన్ జోన్ పరిధిలో రీజియన్ మేనేజర్లతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల మెరుగైన సౌకర్యాలను కల్పించాలన్నారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన రద్దీ అనుగుణంగా బస్సులను నడిపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బీ రాజు-కరీంనగర్, సోలమన్‌రాజు-అదిలాబాద్, సరిరాం-ఖమ్మం, విజయభాను-వరంగల్, జోత్స్న-నిజామాబాద్ ఆర్ఎం లతో పాటు డిప్యూటీ ఆర్ఎంలుభూపతిరెడ్డి, సత్యనారాయణ తదితరులున్నారు.

మున్నూరు కాపు సంఘం ఎన్నిక

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 9: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లి గ్రామ మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కే సంపత్, ఉపాధ్యాక్షుడిగా ఆర్ చుక్కయ్య, ప్రధాన కార్యదర్శిగా కే భాస్కర్, కోశాధికారిగా ఎం కోటేశ్వర్, క్యాషియర్‌గా ఎస్ ప్రభాకర్, గౌరవాధ్యక్షుడిగా రామిడి తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చొప్పదండి, డిసెంబర్ 9: ఈ నెల 10 నుంచి 13 వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్ పోటీలకు మండలంలోని రుక్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక పాఠశాలకు చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి ప్రసాద్ ఎంపికయ్యాడు. కాగా, సోమవారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై విద్యార్థిని పాఠశాల డైరెక్టర్ కేసీరావు, ప్రిన్సిపాల్ కాళహస్తి, శ్రీనివాస్, పీడీ విక్రమ్ అభినందించారు.

సమస్యలనేకం.. పట్టించుకుంటేనే పరిష్కారం

208 దరఖాస్తుల స్వీకరణ

కలెక్టరేట్, డిసెంబర్ 9 : ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రజావాణిలో ఫిర్యాదుదారుల సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉందని, ఏండ్లకేండ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలతో పాటు, కొత్తగా కూడా అనేకం వస్తుండగా, క్షేత్రస్థాయిలో పరిష్కరించడంలో ఆయా శాఖల యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో భారీ సంఖ్యలో ఫిర్యాదుదారులు తరలివచ్చారు. దీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం కోసం 208 మంది అర్జీలు అందజేశారు. వాటిని పరిశీలించిన ఉన్నతాధికారులు విధిగా పరిష్కరించాలంటూ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

కాలు విరిగినా దివ్యాంగురాలిని కాదట



రెక్కాడితే గానీ, డొక్కాడని తన కుటుంబానికి నేనే దిక్కు.. దినసరి కూలీకి వెళ్లి వస్తుండగా, ప్రమాదవశాత్తు కాలు విరిగింది. కూలీ పనులకు వెళ్లలేకపోతున్నా.. సదరం సర్టిఫికెట్ కోసం వైద్యుల వద్దకెళ్తే, తన కాలు పరిశీలించకుండానే నా దరఖాస్తు తిరస్కరించింద్రు. ప్రజావాణిలో ఇప్పటికే నాలుగు సార్లు ఫిర్యాదు చేసినా.. నాకు ఎలాంటి న్యాయం జరుగలేదు. వాకర్ లేకుండా నడిచే పరిస్థితి లేకున్నా.. అధికారులు తనకే వైకల్యమూ లేదంటూ నిర్ధారించడం అన్యాయం.

-బోయిని శశికళ, తీగలగుట్టపల్లి, కరీంనగర్

పింఛన్ వస్తలేదు..



రెండు కాళ్లు చచ్చుబడి పోయినా నాకు కొన్నేళ్లుగా పింఛన్ వచ్చింది. మూడు నెలల నుంచి బంద్రైంది. అధికారులను అడిగితే పట్టించుకుంట లేరు.. కలెక్టర్‌కు దరఖాస్తు ఇస్తే నన్న పింఛన్ మళ్లీ వస్తదని వస్తున్నా. ఇప్పటికే రెండు సార్ల వచ్చి దరఖాస్తు ఇచ్చిన.. ఇంకా నా ఖాతల అయితే పైసలు పడుతలేవు. నాకు పింఛన్ ఇచ్చే దాకా దరఖాస్తు చేసుకుంటా..

- బద్దెనపల్లి అంజయ్య, గుమ్లాపూర్, చొప్పదండి

వేడుకలను ప్రారంభిస్తున్న యూనివర్సిటీ ఉపకులపతి ఉమేశ్ రావు

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

కార్పొరేషన్, డిసెంబర్ 9 : ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదవినప్పుడు తప్పనిసరిగా ఉన్నతస్థానాలు చేరుకుంటారని శాతావాహన యూనివర్సిటీ ఉప కులపతి ఉమేశ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చదువు సంస్కారాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. ఏటా రెండు సార్లు యూనివర్సిటీ నుంచి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని తెలిపారు. దీని కోసం ప్రతి విద్యార్థి 75 శాతం హాజరు తప్పకుండా ఉండాలన్నారు. కిమ్స్ విద్యా సంస్థల చైర్మన్ పేర్యాల రవీందర్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల వారికి విద్య పరమాధిగా విద్యను అందించాలన్న లక్ష్యంతోనే ఈ విద్యా సంస్థలు ప్రారంభించామన్నారు. కళాశాల సిబ్బంది దేవేందర్‌రావు, సాకేత్‌రామరావు, అర్జున్ రావు, అనూష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను క్రమశిక్షణతో పెంచాలి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చైల్డ్ హెల్ప్‌లైన్ మహేశ్, కార్పొరేటర్ శ్రీనివాస్

విద్యానగర్, డిసెంబర్ 9 : పిల్లలను క్రమశిక్షణతో పెంచాలని, బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను అరికట్టాలని 28వ డివిజన్ కార్పొరేటర్ నాంపల్లి శ్రీనివాస్ సూచించారు. సోమవారం కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు కిసాన్‌నగర్ సెక్టార్‌లోని అశోక్‌నగర్ 2వ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్ వివాహ్ ముక్త్ భారత్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళావతి, చైల్డ్ హెల్ప్‌లైన్ మహేశ్, స్థానిక కార్పొరేటర్ నాంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ మహేశ్, టీచర్లు ఆహల్య, జమున, ఏఎన్ఎం స్వరూపరాణి పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాస వ్రత మహోత్సవాలు

కమాన్ చౌరస్తా, డిసెంబర్ 9: కరీంనగర్‌లోని యజ్ఞవరాహ క్షేత్రంలో సర్వవైదిక సంస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి జనవరి 14వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని ఉప కులపతి శ్రీభాష్యం వరప్రసాదశర్మ పేర్కొన్నారు. ఆలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. ఉమ్మడి జిల్లా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని యజ్ఞవరాహస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఇక్కడ కొదుమగుళ్ల సుగుణాకారాచార్యులు, కేఎస్ అనంతాచార్యులు ఉన్నారు.

ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌కు భవానీ సాహిత్యవేదిక అవార్డు

కమాన్ చౌరస్తా, డిసెంబర్ 9 : నరగంలోని ఐఎంఐ హాల్‌లో సోమవారం నిర్వహించిన వేడుకలో భవానీ సాహిత్య వేదిక అవార్డును ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ పసుల రవికుమార్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు వైరాగం ప్రభాకర్ ఆధ్వర్యంలో నూరవ పుస్తక ఆవిష్కరించారు. అనంతరం వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందించిన వారిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ పసుల రవికుమార్‌కు నటుడు ఆంధ్రప్రదేశ్ నంది అవార్డు గ్రహీత సాధనాల వెంకటస్వామి నాయుడు, గేయ రచయిత మల్లిక్ చేతుల మీదుగా అందించారు. ప్రముఖ రచయిత స్తంభం కాడి గంగాధర్, కిషన్ సమక్షంలో సన్మానించారు. వేదిక అధ్యక్షుడు మాట్లాడుతూ రవికుమార్ చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని అన్నారు.

అనువాదం సాహిత్య సంస్కృతిక వారధి

కమాన్ చౌరస్తా , డిసెంబర్ 9 : భాష, భావాల సమాహారమే అనువాదమని, ఇతర భాషల విలువలను సంస్కృతిని రచన తత్వాన్ని మరో భాషలోకి తీసుకురావడం లక్ష్యంగా అనువాదం సాగుతుందని అనువాదం ఒక వృతిగా కూడా మారిందని, ఎన్నో అవకాశాలను సృష్టిస్తుందని కేంద్ర సాహిత్య అనువాద పురస్కార గ్రహీత వారాల ఆనంద్ అన్నారు. ఆచార్య కలువకుంట రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు అనువాద పద్ధతులపై ఒక్కరోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సాహితాన్ని తమ జీవితంలో భాగంగా చేసుకొని పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవాలన్నారు. అటానమస్ కో ఆర్డినేటర్ వంగల శ్రీనివాస్, అధ్యపకులు బూర్ల వెంకటేశ్వర్లు, డీ ప్రకాశ్ ఆర్ శ్రీనివాస్, మెట్టు వెంకటేశ్వర్లు, అశోక్, చైతన్య పాల్గొన్నారు.

అవినీతిని నిర్మూలిద్దాం - దేశాన్ని అభివృద్ధి చేద్దాం

హౌసింగ్ బోర్డు కాలనీ, డిసెంబర్ 9 : హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవినీతి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ' అవినీతిని నిర్మూలిద్దాం దేశాన్ని అభివృద్ధి చేద్దాం' అనే నినాదంతో ముద్రించిన వాల్ పోస్టర్‌ను రిటైర్డ్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ అనంతం సీతారాంపూర్‌లోని తన గృహంలో ఆవిష్కరించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి ఏ రూపంలో ఉన్నా దానిని నిర్మూలించాలని, ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, నాయకులు తమ కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తించాలని తెలిపారు. రాష్ట్ర దేశ అభివృద్ధి అవినీతిని అరికట్టినప్పుడే సాధ్యపడుతుందని చెప్పారు. ధనపురి సాగర్, డాక్టర్ జీ శ్రీనివాస్,గోగురి శ్రీధర్ రెడ్డి, కే శ్రీనివాస్, జే రమణ, కే వేణు గోపాల్ శర్మ పాల్గొన్నారు.

రైతుల సంతకాల సేకరణ

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 9 : మండలంలోని చెర్లభూత్కూర్‌లో రైతులు రుణమాఫీ కానివారు సంతకాల సేకరణను గ్రామ రైతు జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సంతకాలు సేకరించారు. మంగళవారం సంతకాల సేకరణ పత్రాలను కలెక్టర్‌కు అందిస్తామని, అనంతరం ఎమ్మెల్యేలకు, మంత్రులకు రైతు రుణమాఫీపైన వినతిపత్రాలు అందించి, రైతులకు రుణామాఫీ చేసే వరకు ప్రత్యేక కార్యాచరణలో ముందుకు సాగుతామని రైతు జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.

అసోసియేషన్ కార్యవర్గం ..

ముకరంపుర, డిసెంబర్ 9 : తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్-621 జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా జనరల్ సెక్రటరీగా ఆరెపల్లి శ్యామయ్య, అధ్యక్షుడిగా ఉబ్బని కిరణ్‌కుమార్, ట్రెజరర్‌గా ముల్కల విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేపల్లి అంజయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా డీ తిరుపతి, మద్దెల రవీందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ కంపెనీ సెక్రటరీ కుమారస్వామి, కంపెనీ ప్రెసిడెంట్ ఆనందం, ట్రెజరర్ నర్సింహులు, పలు జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు

శంకరపట్నం, డిసెంబర్ 9: వరి కొయ్యల కాల్చివేస్తే మట్టిలోని మిత్ర కీటకాలు, మిత్ర బాక్టీరియా చనిపోతాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. సోమవారం మొలంగూర్, రాజాపూర్‌లో వరి కొయ్యల కాల్చివేతతో జరిగే అనర్థాలను రైతులకు వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పీ రాజ్‌కుమార్, టీ కీర్తన, రైతులు పాల్గొన్నారు.